


# కరపత్రం

SINCE 2014

శనివారం ఆగస్ట్ 15, 2026 | సంపుటి : 2 | సంచిక : 304 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



# చదువుతోనే

## ఆత్మగౌరవం, గుర్తింపు

## విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన

» నర్సరీ నుంచి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
» కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
» గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు దూరం చేసింది
» పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్

**హైదరాబాద్,ఆగస్ట్14 :**
చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు.

2లో..






## బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

▪ భౌతికి కాయం వద్ద నివాళులు

**హైదరాబాద్,ఆగస్ట్14 :**
అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు.

2 లో



## జిల్లాలో 5.77 లక్షల మంది రేషన్ లబ్దిదారులు

▪ స్మార్ట్ కార్డులు అందించేందుకు ఏర్పాట్లు

**రాజన్నసిరిసిల్ల,ఆగస్ట్14 :**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.96 లక్షల కార్డులు ఉండగా, 5.77లక్షల మంది లబ్దిదారులు ఉన్నారు. ఇందులో ఆహార భద్రత కార్డులు 182444 ఉండగా, 5419144 మంది లబ్ది దారులు ఉన్నారు.



## డబుల్ ఇళ్లపై ఎందుకీ విమర్శలు

» మాతో వస్తే నిజాలు ఏమిటో చూపిస్తాం
» సిఎం రేవంత్‌కు మాజీమంత్రి తలసాని సవాల్

**హైదరాబాద్,ఆగస్ట్14 :**
బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తిప్పికొట్టారు. దమ్ముంటే తమతో వస్తే తాము కట్టిన ఇండ్లను, ఉంటున్న ప్రజలను చూపిస్తామని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తలసాని మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో 69 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామని గుర్తు చేశారు.

మిగతాద్ది 2 లో

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

» పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి
» పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,ఆగస్ట్14 :**
కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.

2 లో



## మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

▪ పూలే దంపతుల ఆశయ సాధనలో ప్రజా ప్రభుత్వం
▪ దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన
▪ రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు
▪ ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
▪ విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నాం
▪ పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2 లో

## యాదగిరిగుట్ట పాలక మండలి కీలక నిర్ణయాలు



యాదగిరిగుట్ట పాలక మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. పాలకమండలి సమావేశంలో 26 అంశాలకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ధర్మకర్తల మండల చైర్మన్ సత్యనారాయణరెడ్డి తన సొంత నిధులతో బాలాలయ స్థలంలో నిత్య కల్యాణ మండపం నిర్మించనున్నారు. రూ 9.87 కోట్లతో రాయగిరి వద్ద నిర్మించనున్నారు. 3.67 కోట్లతో ఆర్చ్ నిర్మించనున్నారు. కొండపై ఎలక్ట్రికల్ శంకు చక్రం నామాలకు ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ రూ. 84 లక్షలు విరాళం ప్రకటించారు.అన్న ప్రసాదం భోజన సామర్థ్యం 2 వేల మందికి పెంచుతూ పాలక మండలి నిర్ణయం తీసుకుంది. తులసి కాటేజ్ వద్ద ప్రత్యేక కల్యాణ కట్ట, డోనార్ ఎగ్జిబిషన్ సెంటర్ నిర్మాణం, సోలార్ పవర్ జనరేషన్ నిర్మాణం, కాలినడకన మెట్ల మార్గంలో షెడ్ నిర్మాణం, 43.12 కోట్లతో దీక్షపరుల మండపం నిర్మించేలా పాలకమండలి నిర్ణయాలు

## నేరాల స్వరూపం మారుతోంది

» సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో అవేర్‌నెస్
» రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన
» డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి

2లో



**హైదరాబాద్,ఆగస్టు14 :**
నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.



## స్మార్ట్ రేషన్ కార్డులపై మోడీ ఫోటో పెట్టాలి

▪ అన్ని సరుకులను ప్రజలకు ఇవ్వాలి
▪ బిజెపి ఎంపి రఘునందన్ రావు డిమాండ్

2లో

**న్యూఢిల్లీ,ఆగస్టు14 :**
తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కేంద్రమే అధిక మొత్తంలో బియ్యం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు.



## గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు

▪ సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే...
▪ ఆగస్టు చివరి నాటికి టెండర్ పక్రియ పూర్తి చేయాల్సిందే
▪ నాణ్యతలో రాజీ పడొద్దు... ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి
▪ గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో శ్రీధర్ బాబు ఆదేశాలు

మిగతాది 2లో

# చదువుతోనేఆత్మగౌరవం, గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్-1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖజ్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు.

క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుకే ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పూలే విధానాలను కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుందన్నారు.

## బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

మొదటిపేజీ తరువాయి

ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.

## డబుల్ ఇళ్లపై ఎందుకీ విమర్శలు

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీలో ఐఏఎస్,ఐపీఎస్ ఆఫీసర్ల క్వార్టర్స్ ఈ విధంగా లేవని నాటి గవర్నర్ డబుల్ బెడ్ రూమ్

ఇళ్లను మెచ్చుకున్నారని తెలిపారు. కొల్లూరులో ఒక్క చోటే 16 వేల ఇండ్లను కట్టామని వెల్లడించారు. నాటి డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్, ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను చూపించిన విషయాన్ని చూపించామని వెల్లడించారు. కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ రూమ్ యూనిట్ కాస్ట్ రూ. 9.50 లక్షలు కాగా లబ్దిదారుడికి ఉచితంగా అందించామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇస్తామని అంటున్న ఇందిరమ్మ ఇళ్లకు లబ్దిదారుడు 6 లక్షలు కట్టాలని అంటోందని, అప్లికేషన్ కు మరో 10 వేలు ఇవ్వాలని మేలిక పెట్టారని ఆరోపించారు. ఒక్కో లబ్దిదారుడికి ఎన్ని గజాల్లో నిర్మించి ఇస్తారోనన్న విషయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్లికేషన్ కు 10 వేల రూపాయలు వసూలు చేసి ఇండ్లను ఇవ్వలేదని విమర్శించారు. పేదవారి భూములను, ఇండ్లను 22 ఏ ద్వారా నిషేధిత జాబితాలో పొందుపరిచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. ఏమి తేలియనట్లు 22 ఏపై మీ భూమి మీకే ఇప్పిస్తా అని సీఎం ప్రకటించడం ఆయన ద్వందవైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల భూమి ప్రజలకు ఇవ్వడానికి రేవంత్ రెడ్డి ఎవరని ప్రశ్నించారు. 22 ఏలో ఉన్న భూములను ఎత్తివేసేందుకు 30 నుంచి 40 శాతం కమిషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. బాధ్యత గల సీఎం పదవిలో ఉన్న రేవంత్ రెడ్డి క్షుద్ర పూజల గురించి మాట్లాడడం శోచనీయమని అన్నారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు

ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

మొదటిపేజీ తరువాయి

'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

## జిల్లాలో 5.77 లక్షల మంది రేషన్ లబ్దిదారులు

మొదటిపేజీ తరువాయి

అంత్యోదయ అన్నయోజన కార్డులు 13827 ఉండగా, 35428 మంది లబ్దిదారులు ఉన్నారు. అన్నపూర్ణయోజన కార్డులు 199 ఉండగా 205 మంది లబ్దిదారులు ఉన్నారు. జిల్లాలో రేషన్‌కార్డుల్లో బోయిన పల్లిలో 13326 కార్డులు, చందుర్తిలో 12253 కార్డులు, గంభీరావుపేటలో 15927 కార్డులు, ఇల్లంతకుంటలో 17367కార్డులు, కోనరావుపేటలో 15713కార్డులు, ముస్తాబాదులో 16661కార్డులు, రుద్రంగిలో 5529 కార్డులు, సిరిసిల్లలో 30526 కార్డులు, తంగళ్ళపల్లిలో 16128 కార్డులు, వీర్నపల్లిలో 4814 కార్డులు, వేముల వాడలో 22171 కార్డులు, వేములవాడ రూరల్ 8471 కార్డులు, ఎల్లారెడ్డిపేటలో 17584 కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో లబ్దిదారుల్లో బోయినపల్లిలో 37711 మంది లబ్దిదారులు, చందుర్తిలో 35413 మంది లబ్దిదా రులు, గంభీరావుపేటలో 49380 మంది లబ్దిదారులు, ఇల్లంతకుంటలో 49257 మంది లబ్దిదారులు, కోన రావుపేటలో 46236 మంది లబ్దిదారులు, ముస్తాబాద్ లో 49257 మంది లబ్దిదారులు, రుద్రంగిలో 17551 మంది లబ్దిదారులు, సిరిసిల్లలో 9161 మంది లబ్దిదా రులు, తంగళ్ళపల్లిలో 46445మంది లబ్దిదారులు, వీర్నపల్లిలో 15119మంది లబ్దిదారులు, వేములవాడలో 66475 మంది లబ్దిదారులు, వేములవాడ రూరల్‌లో 24272 మంది లబ్దిదారులు, ఎల్లారెడ్డిపేటలో 51267 మంది లబ్దిదారులు ఉన్నారు. వీరందరికి స్మార్ట్ కార్డులు అందనున్నాయి.

## నేరాల స్వరూపం మారుతోంది

మొదటిపేజీ తరువాయి

సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

మొదటిపేజీ తరువాయి

బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్ని ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు. బీసీల రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ, గతంలో ఏ ప్రభుత్వమూ ఆ సాహసం చేయలేదన్నారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు.

త ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300 మందికే ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700లకు పెంచినట్లు తెలిపారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ. 200 కోట్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినట్లుగా.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని, వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## గోదావరి పుష్కర పనుల్లో అలసత్వం తగదు

మొదటిపేజీ తరువాయి

'గోదావరి పుష్కరాలు-2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభ మయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు 2027' కేబినేట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశర చేశారు. అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్ఠిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై మోడీ ఫోటో పెట్టాలి

మొదటిపేజీ తరువాయి

ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 15, 2026

# రెచ్చగొడితే.. దెబ్బ కొడతాం
# పాకిస్థాన్ పై అజిత్ దోవల్ ఫైర్

**కరపత్రం బ్యూరో, హైదరాబాద్**

కయ్యాల మారి, వదరుబోతు పాకిస్తాన్ కు భారత జాతీయ సలహాదారు అజిత్ దోవల్ తీవ్ర హెచ్చరిక చేశారు.

**వదరితే వదలం అంటూ...**

పాకిస్థాన్ పై నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ (NSA) అజిత్ దోవల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

భారత సహనాన్ని బలహీనతగా భావించరాదని స్పష్టం చేశారు. ఎలాంటి పరిణామాలు ఎదురైనా భారత్ ఎప్పుడూ రిస్క్ లు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటుందని.. బలంగా ప్రతిస్పందిస్తుందని అన్నారు.

పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై తొలిసారిగా స్పందించిన అజిత్ దోవల్ ఇందుకు సంబంధించిన డాక్యుమెంటరీలో ఈ




విషయాన్ని వెల్లడించారు. ఆపరేషన్ సింధూర్ ను ఎలా చేపట్టాలని ముందుగానే నిర్ణయించుకున్నామని పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని కీలక ఉగ్ర స్థావరాలపై, ఉగ్రవాద క్యాంపులపై దాడులు చేపట్టామని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ధీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ప్రపంచ దేశాలకు ఆపరేషన్ సింధూర్ తో చూపామని అజిత్ దోవల్ స్పష్టం చేశారు.

ఇక జమ్మూ కాశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గామ్ లోయలో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు జరిపిన మారణ హోమంలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ దాడుల వెనకున్నట్లు తేలిన నేపథ్యంలో పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 కీలక ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది.

వందలాది మంది ఉగ్రవాదులను ఏరివేసింది. వాటిలో ముజఫరాబాద్ లోని సవాయ్ నాలా క్యాంప్ అలాగే సిడ్నా బిలాల్ క్యాంప్, కోట్లీలోని గుల్ పూర్ క్యాంప్, భీంబర్ లోని బర్నాలా క్యాంప్, అబ్బాస్ క్యాంప్, సియాల్ కోట్ లోని సర్జాల్ క్యాంప్, మెహమూనా జోయా క్యాంప్, మురిడ్ కే లోని మార్కాజ్ టైబా క్యాంప్, బహావల్ పుర్ లోని మార్కజ్ సుభానల్లా క్యాంప్ ఉన్నాయి. వీటిని భారత్ పూర్తిగా ధ్వంసం చేసిన విషయం ఇదివరకే స్పష్టం చేయడం జరిగింది.

# పెట్రోల్ బంకులో మోసం జనం ఆందోళన



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం అంబేద్కర్‌నగర్‌లోని భారత పెట్రోల్ బంకు లో గురువారం మోసం జరిగినట్లు వినియోగదారులు ఆందోళనకు దిగారు.కారు సామర్థ్యం 42 లీటర్లు కాగా, 53 లీటర్లు డీజిల్ పోసినట్లు బిల్లు చూపించడంతో వాహనదారుడు సందీప్ "బంకు సిబ్బంది"ని ప్రశ్నించారు.దీంతో బంకు ను తాత్కాలికంగా మూసివేశారు.పౌరసరఫరాల అధికారి సంధ్య, తూనికలు కొలతల్లో లోపాలు లేవని తెలిపారు. బంకులో వసతులు సరిగా లేవని, ఘటనపై త్వరలో చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారి ఎండీ రియాజ్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

# ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ. 5 లక్షల ఉచిత వైద్యం
# వాట్సాప్‌లోనే హెల్త్ కార్డ్

**గజెల్లి రాజేంద్రప్రసాద్, సోషల్ అనలిస్ట్**

వాట్సాప్‌లో ఒక్క "Hi" అని మెసేజ్ పంపితే చాలు...ఏకంగా రూ. 5 లక్షల ఉచిత వైద్యం పొందే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్ మీ చేతికి వచ్చేస్తుంది.

- **కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన' పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రతి సంవత్సరం రూ. 5 లక్షల వరకు ఉచిత క్యాష్‌లెస్ వైద్య బీమా లభిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న వేల సంఖ్యలో ఉన్న ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు, మందులు, ఆసుపత్రి వైద్య ఖర్చులన్నీ రూపాయి ఖర్చు లేకుండా పొందవచ్చు.**

**వయోవందన పథకం**

వయోవందన పథకం కింద ముఖ్యంగా 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఎలాంటి కుటుంబ ఆదాయ పరిమితి లేకుండా 'వయో వందన' కింద నేరుగా ఈ పథకం వర్తిస్తుంది.




దీంతో పాటు తెల్ల రేషన్ కార్డు లేదా సామాజిక-ఆర్థిక డేటాలో పేరు ఉన్న పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలన్నీ ఈ ఉచిత ఆరోగ్య బీమాను పొందేందుకు పూర్తి అర్హులు.

కుటుంబంలో ఉన్న సభ్యుల సంఖ్యపై ఎలాంటి పరిమితి లేదు. అంతేకాకుండా, ఈ ఒక్క కార్డ్‌తో సొంత రాష్ట్రంలోనే కాకుండా భారతదేశంలో ఎక్కడైనా ఉచిత వైద్య సేవలు పొందవచ్చు.

- **ఒకవేళ ఇంట్లో 70 ఏళ్లు దాటిన వృద్ధులు ఉంటే, వారికి కుటుంబ పరిమితితో సంబంధం లేకుండా అదనంగా మరో రూ. 5 లక్షల కార్డ్ ఉచితంగా ఇస్తారు.**

**హాయ్ అని మెసేజ్ పంపండి**

ఇక ఈ హెల్త్ కార్డ్ కోసం మీసేవ కేంద్రాలు లేదా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరమే లేదు. మీ ఫోన్‌లో - 91 72908 23838 నంబర్ ను సేవ్ చేసుకొని, వాట్సాప్‌లో "Hi" అని మెసేజ్ పంపి, చాట్‌బాట్‌లో My Ayushman Card ఆప్షన్ ఎంచుకోవాలి.

ఆ తర్వాత ఆధార్ ఓటీపీ ద్వారా e-KYC పూర్తి చేస్తే ఆయుష్మాన్ కార్డ్ నేరుగా మీ వాట్సాప్‌లోనే డౌన్‌లోడ్ అవుతుంది.

మీ సమీపంలో ఉచిత వైద్యం అందించే ఆసుపత్రుల వివరాలు తెలుసుకోవడానికి లేదా ఇతర సందేహాల కోసం ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 14555 కు కాల్ చేయవచ్చు.

**అత్యవసర సమయంలో ప్రాణరక్షణగా, ఆర్థిక ఆసరాగా నిలిచే ఈ విలువైన సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, సామాన్యులకు తెలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది.**

# కేంద్ర నిధులపై బహిరంగ చర్చకు సిద్ధం
## ఎంపీ ఈటల రాజేందర్ సవాల్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

కేంద్ర నిధులపై కాంగ్రెస్ ప్రభుత్వం అసత్యాలు చెబుతోందని, బహిరంగ చర్చకు సిద్ధమని ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎంపీ ఈటెల రాజేందర్.కేంద్రం నుంచి నిధులు రాలేదంటే బహిరంగ చర్చకు మేము సిద్ధం అని అన్నారు.

కేంద్రం అడిగిన దానికి మించి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు ఇచ్చింది. కావాలంటే బహిరంగ చర్చతో మేమే తేల్చి చూపిస్తాం అన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పేరుతో కొత్త కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. కేంద్ర ప్రభుత్వానికి వాటా ఉన్నా కనీసం మోడీ గారి ఫోటో కూడా పెట్టలేదు అని అన్నారు.

రికి ఎల్లవేళలా వాడుకునేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సారధ్యంలో అంటూ కార్డులు ప్రింట్ చేస్తే లబ్ధి దారులకు ఎల్లవేళలా వాడుకునే అవకాశం ఉండేదన్నారు.

అప్పుడు ధరణి ఇప్పుడు భూభారతి పేరుతో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారాయని ఈటెల రాజేందర్ విమర్శించారు.

# రాయపర్తి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ.. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య

**కరపత్రం ప్రతినిధి రాయపర్తి, ఆగస్టు 14**

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య శుక్రవారం పరకాల ఏరియా పరిధిలోని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఔషధ నిల్వలను క్రమబద్ధంగా అమర్చాలని ఆదేశించారు. ఒకే రకమైన మందులకు వేర్వేరు గడువు తేదీలు ఉన్నప్పుడు ముందుగా గడువు ముగిసే మందులను ముందుగా వినియోగించే ముందుగా గడువు ముగిసే మందులు--ముందుగా వినియోగం విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. గడువు ముగిసిన మందులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సురక్షితంగా తొలగించాలని తెలిపారు.

అనంతరం శస్త్రచికిత్స గదిని పరిశీలించి, అందులోని పరికరాల నిర్వహణ, పరిశుభ్రత, సదుపాయాలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు



శస్త్రచికిత్స గదిలో ఎల్లప్పుడూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. ప్రతిరోజూ జ్వర సర్వే నిర్వహించి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే చికిత్స అందించాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి లార్వాను నిర్మూలించాలని, అవసరమైన చోట్ల టెమిఫాస్ ఔషధాన్ని వినియోగించాలని తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలకవర్గాలు, ఆరోగ్య సహాయకులు, సహాయ నర్సు మిడ్‌వైఫ్‌లు, క్షేత్రస్థాయి సిబ్బంది, పర్యవేక్షకులు సమన్వయంతో



పనిచేస్తూ కన్వర్జెన్స్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో ముందస్తు అవగాహన కల్పించి నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.

సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా అసమర్థత ప్రదర్శించిన వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ తనిఖీలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ వి. శ్రీనాథ్, ఆరోగ్య విద్యాధికారి శిలగాని రాజ్‌కుమార్, మధ్యస్థాయి ఆరోగ్య సేవల వైద్యురాలు డాక్టర్ మాధవి, సిబ్బంది నర్సులు, సహాయ నర్సు మిడ్‌వైఫ్‌లు, ఆరోగ్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తుల ఫోటోలు ప్రదర్శించిన కోరుట్ల పోలీసులు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.సీఐ శ్రీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరస్తుల చిత్రపటాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, వారి కదలికలను పర్యవేక్షించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యామ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లన్న గండి అభివృద్ధితో స్టేషన్ ఘనపూర్‌కు కొత్త గుర్తింపు: ఎమ్మెల్యే కడియం శ్రీహరి

.తాటికొండలో రూ.15 కోట్ల బీటీ రోడ్డు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం -- రూ.30 లక్షల 3వీవో భవనాలకు శంకుస్థాపన

**కరపత్రం ప్రతినిది**
**స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 14**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. గతంలో 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి చేసిన పనులను, తాను రెండున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. శుక్రవారం స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ రహదారి నుంచి మల్లన్నగండి వరకు రూ.15 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, నూతన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. రూ.30 లక్షలతో నిర్మించనున్న 3వీవో భవనాలకు భూమిపూజ నిర్వహించి, జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు



యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ తాటికొండ గ్రామానికి రెండున్నరేళ్లలోనే రూ.29 కోట్లతో మల్లన్నగండి కుడి కాలువ పూర్తి చేసి సాగునీరు అందించామని, రూ.15 కోట్లతో బీటీ రోడ్డు, గ్రామంలో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, 3వీవో భవనాలు మంజూరు చేశామని తెలిపారు. తాను ప్రజల మధ్య ఉండి నిజాయితీగా అభివృద్ధి కోసం పనిచేస్తుంటే, కొందరు అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణం, ఇళ్లపై నుంచి వెళ్లే విద్యుత్ లైన్ల తొలగింపుకు కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మల్లన్నగండి రిజర్వాయర్ ప్రస్తుతం ప్రకృతి అందాలతో కొనసీమను తలపిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ప్రాజెక్టుకు కొత్త రూపు వచ్చిందని, చుట్టూ కొండలు, పచ్చని పొలాలతో ఇది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మల్లన్నగండి ద్వారా చిల్పూర్, స్టేషన్ ఘనపూర్ మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతుండగా, రైతులు కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, రైతు భరోసా, కొత్త పెన్షన్లు వంటి పథకాలు ప్రజలకు నేరుగా చేరుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ కొత్త పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.

కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుజన శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య శశిరీష్ రెడ్డి, పంచాయతీరాజ్, హౌసింగ్ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రీడలు ఒత్తిడిని దూరం చేస్తాయి
## మెట్టుపల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

**గాజంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిన్న మెట్టుపల్లి లో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది.మెట్టుపల్లి మునిసిపల్ అధికారులు సిబ్బంది మరియు మునిసిపల్ కౌన్సిలర్ల మధ్యన జరిగిన ఈ



స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఉత్సాహ భరితంగా సాగింది.క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఒత్తిడిని దూరం చేస్తాయని మెట్టుపల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు.శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించిన ఈ క్రికెట్ మ్యాచ్ కు ముఖ్య అతిథిగా చైర్మన్ లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఒత్తిడిని దూరం చేస్తాయని అన్నారు.

క్రీడలు మానసిక ఆనందాన్ని, ఉల్లాసాన్ని కలిగించడమే కాకుండా మునిసిపల్ పాలకవర్గ సభ్యులకు, మునిసిపల్ సిబ్బంది అధికారులకు మధ్య మంచి సమన్వయాన్ని ఏర్పరుస్తుందని అన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

శనివారం ఆగస్ట్ 15, 2026

# ఎస్‌యూఆర్ నమోదు వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీసిన తెలంగాణ రక్షణ సేన

- లక్షలాది ఓటర్లు నమోదు కాకపోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం..
- పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 14**

ఎస్‌యూఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నమోదు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వేలాది మంది అర్హులైన ఓటర్లు నమోదు కాకపోవడం అత్యంత ఆందోళనకరమని తెలంగాణ రక్షణ సేన నాయకులు ఆరోపించారు. ఈ ప్రక్రియలో జరిగిన లోపాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షులు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. ఎస్‌యూఆర్ నమోదు ప్రక్రియలో అధికార యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. వరంగల్ జిల్లాలో 7.76 లక్షల ఓటర్లలో 6.78 లక్షల మంది మాత్రమే ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించగా, 98,930 మంది




నమోదు కాలేదని తెలిపారు. హనుమకొండ జిల్లాలో 5.09 లక్షల ఓటర్లలో 4.07 లక్షల మంది మాత్రమే నమోదు చేసుకోగా, దాదాపు 1.01 లక్షల మంది నమోదు ప్రక్రియకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 శాతం మంది ఓటర్లు నమోదు కాలేదని ప్రభుత్వం స్వయంగా అంగీకరించడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఎల్‌వోలు నిర్వహించిన ఎన్యుమరేషన్ ప్రక్రియపై అనుమానాలు ఉన్నాయని, ఇప్పటివరకు సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని కోరారు. మరోసారి ఎన్యుమరేషన్‌కు అవకాశం కల్పిస్తే విస్తృత ప్రచారం నిర్వహించి ఒక్క అర్హ ఓటరు కూడా మిగలకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓటర్ల సంఖ్య తగ్గితే గ్రేటర్ వరంగల్‌లో భవిష్యత్తులో డివిజన్ల పెంపుపై కూడా ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చిలుక ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 73 లక్షల ఓట్ల తొలగింపు అత్యంత తీవ్రమైన అంశమని అన్నారు. ఈ తప్పిదాన్ని సహచర మంత్రులపై నెట్టివేయడం ద్వారా ముఖ్యమంత్రి తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే 35 వేల ఓట్లు తొలగించబడిన విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 31 నెలలు గడిచినా కేవలం 7 వేల ఇళ్లకే శంకుస్థాపన చేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. విద్యాశాఖ, హోంశాఖ వంటి కీలక శాఖలు సమర్థవంతంగా నడవకపోవడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు భరోసా, పేదలకు ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలెండర్ వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ రక్షణ సేన ఈ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వీర భిక్షపతి, నాయకులు నిశాంత్ రావు, సుమన్, సుజిత్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో అన్విత్ పటేల్కు గోల్డ్ మెడల్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు 14**



జపాన్ కరాటే షోటోఖాన్ అకాడమి ఆధ్వర్యంలో బెంగళూర్ లో నిర్వహించిన 15వ జాతీయ స్థాయి షోటోఖాన్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో బర్కత్ పుర లోని శ్రీ చైతన్య స్కూల్ 9వ తరగతి విద్యార్థి లక్కాకుల అన్విత్ పటేల్ పాల్గొని కుమితి విభాగంలో మొదటి బహుమతి (గోల్డ్ మెడల్), కటా విభాగంలో రెండవ బహుమతి (సిల్వర్ మెడల్) సాధించారు. అన్విత్ పటేల్ కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమిలో మాస్టర్ డాక్టర్ జివిస్ గోపాల్ రెడ్డి వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నారు. జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన అన్విత్ పటేల్ ను శుక్రవారం శ్రీచైతన్య స్కూల్ బర్కత్ పుర ప్రిన్సిపాల్ ఆకుల మాధవి దేవి అభినందించి సన్మానించారు. తమ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం తమ స్కూల్ కే గర్వకారణంగా ఉందని ఆమె అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ గాయాత్రి, సి బ్యాచ్ ఇంచార్జీ వెంకటేష్, టీచర్స్ పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డి హైదరాబాద్ రాజకీయాలకే పరిమితం కావాలి: వాసాల రామస్వామి ఎద్దేవా

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 14**



హుజూరాబాద్‌లో రాజకీయ వివాదాల కంటే ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపైనే ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని జమ్మికుంట మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల తరచూ హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారంటూ ఎద్దేవా చేస్తూ, ఆయన హైదరాబాద్ రాజకీయాలకే పరిమితం కావాలని వ్యాఖ్యానించారు. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను తీసుకురావడానికి కృషి చేస్తున్నారని వాసాల రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలిపై విమర్శలు చేసిన ఆయన, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, విద్య, వైద్యం, రహదారులు, సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. గత రాజకీయ పరిణామాలను ప్రస్తావించిన వాసాల రామస్వామి, ఎంపీ రాజేందర్ హైదరాబాద్‌కు వెళ్లిపోయినట్లే, ప్రస్తుతం కౌశిక్‌రెడ్డి కూడా తరచూ హైదరాబాద్ రాజకీయాల్లోనే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. అందువల్ల ఆయనను హుజూరాబాద్‌లో కాకుండా హైదరాబాద్‌కే పరిమితం చేయాలని, ఆ దిశగా కేసీఆర్, కేటీఆర్, వినోద్‌కుమార్‌లు ఆలోచించాలని వ్యాఖ్యానించారు. హుజూరాబాద్ ప్రజలకు రాజకీయ ఘర్షణలు కాకుండా అభివృద్ధి అవసరమని, వ్యక్తిగత విమర్శల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని వాసాల రామస్వామి కోరారు.

# స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెస్ పాత్ర చిరస్మరణీయం: చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి

- దేశ సమైక్యత, రైతు సంక్షేమం, అభివృద్ధే స్వాతంత్ర్య దినోత్సవానికి నిజమైన నివాళి

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 14**

భారత స్వాతంత్ర్య సమరంలో భారత జాతీయ కాంగ్రెస్ పోషించిన చారిత్రక పాత్రను, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్‌తో పాటు వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను దేశం ఎన్నటికీ మరువదని హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి అన్నారు. శనివారం భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని - ఆగస్టు 15 పురస్కరించుకుని జిల్లా ప్రజలకు హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా చైర్మన్ వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి భారత జాతీయ కాంగ్రెస్ ప్రధాన వేదికగా నిలిచి, కోట్లాది మంది




ప్రజలను స్వేచ్ఛా పోరాటంలో భాగస్వాములను చేసిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి లభించిన స్వాతంత్ర్యాన్ని ప్రతి భారతీయుడు గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను సాకారం చేసే దిశగా ప్రజలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. దేశ అభివృద్ధిలో రైతుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, అన్నదాత సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ దేశ సమగ్రాభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, విలువలను కాపాడుతూ సామరస్యం, సౌభ్రాతృత్వం, దేశభక్తి భావాలను మరింత బలోపేతం చేయాలని ఆయన అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. చివరగా జిల్లా ప్రజలందరికీ మరోసారి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొనాలని పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి ఆకాంక్షించారు.

# ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్‌కు విశేష స్పందన

- తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆగస్టు 20 నుంచి శిక్షణ ప్రారంభం
- పేద విద్యార్థులకు కోచింగ్‌తో పాటు స్టడీ మెటీరియల్ కూడా ఉచితం
- టిఆర్ఎస్ లీడర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, బిర్లా విద్యాసంస్థల చైర్మన్, లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, ఆగస్టు 14**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, బిర్లా విద్యా సంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో విద్యార్థినీలకు ఉచిత కోచింగ్ సంబంధించిన అప్లికేషన్ ఫారం ను అందజేశారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ రాష్ట్ర




నేత డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. పాత్‌ఫైండర్ ఎంట్రెన్స్ కాలేజ్ సహకారంతో హనుమకొండ కొత్త బస్టాండ్ సమీపంలోని కళాశాల ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఉచిత పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కోచింగ్ ప్రకటన వెలువడిన వెంటనే విశేష స్పందన లభించిందని, ఇప్పటికే 100 మందికి పైగా అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థులకు అనుభవజ్ఞులైన సీనియర్ అధ్యాపకులు, సబ్జెక్టు నిపుణుల ద్వారా నాణ్యమైన శిక్షణ అందించనున్నామని చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం విడివిడిగా బ్యాచీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సమీపంలోని ప్రైవేట్ హాస్టళ్లలో వసతి సదుపాయం కల్పించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. కేవలం కోచింగ్ మాత్రమే కాకుండా పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా తెలంగాణ రక్షణ సేన తరఫున పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతతో పాటు ఆర్థికంగా వెనుకబడిన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతోనే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తారని లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ ఇన్చార్జి చిలక ప్రవీణ్, నాయకురాలు జ్యోతి రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖుష్ మహల్‌లో స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్ల పరిశీలన



**కరపత్రం ప్రతినిధి వరంగల్,ఆగస్టు 14**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఖిలా వరంగల్‌లోని ఖుష్ మహల్ వేదిక కానుంది. శనివారం నిర్వహించనున్న అధికారిక వేడుకలకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ,అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఖుష్ మహల్ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక,పరేడ్,సీటింగ్,విద్యుత్,తాగునీరు,పారిశుద్ధ్యం,ట్రాఫిక్,భద్రత,పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు,అధికారులు,స్వాతంత్ర్య సమరయోధులు,ఆహ్వానితులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాంగణంలో పారిశుద్ధ్యంతో పాటు తాగునీరు,వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ నియంత్రణ,పార్కింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జాతీయ పండుగను గౌరవప్రదంగా,ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి.సంధ్యారాణి,వై.వి.గణేష్,ఆర్డీవో సుమ,తహసీల్దార్ ఇక్బాల్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో నిత్యాన్నదానం 26 అంశాలకు పాలకమండలి ఆమోదం

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పాలక మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 26 అంశాలకు ఆమోదం తెలిపింది. కొండపై దీక్షాపరుల, నిత్యకల్యాణ మండపాల ఏర్పాటు, మెట్ల మార్గంలో షెడ్లు, వేద పాఠశాల, గోశాల, రాయగిరి వద్ద భారీ కమాన్ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. రోజూ 2వేల మంది భక్తులకు అన్నదానం అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు టీసీఎస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తుల కోసం ప్రత్యేక సబ్ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. కొండ చుట్టూ ప్రధాన కూడళ్ల వద్ద రాతి విగ్రహాల ఏర్పాటు, తులసి కాటేజీలో రెండు కల్యాణ కట్టల నిర్మాణానికి ట్రస్ట్ బోర్డు ఆమోదం ముద్ర వేసింది. దాతల కోసం కొండపై ప్రత్యేక కార్యాలయం, గిరిప్రదక్షిణ మార్గంలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు.. తెలిపిన ఈ ఆర్ వైద్యం రాజగోపాల్

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం దేశభక్తి, త్యాగం, జాతీయ ఐక్యతకు ప్రతీక
- జాతీయ సమైక్యతతోనే వికసిత భారత లక్ష్యం సాకారం

**కరపత్రం ప్రతినిధి హనుమకొండ, ఆగస్టు 14**

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని - ఆగస్టు 15 పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ఓరుగల్లు ప్రజలకు, పద్మశాలి బాంధవులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వరంగల్ బీసీ జేఏసీ వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్ టీ-పీపీఎస్ వైస్ ప్రెసిడెంట్ ఈఆర్ వైద్యం రాజగోపాల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ... శతాబ్దాల బానిస సంకెళ్లను తెంచుకుని స్వేచ్ఛా భారతావనిగా అవతరించిన ఆగస్టు 15 భారత జాతి చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడిన మహోన్నత ఘట్టమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనేది కేవలం ఒక హక్కు మాత్రమే కాదని, కోట్లాది మంది మహనీయుల త్యాగాలు, అంకితభావం, అచంచల దేశభక్తికి ప్రతిఫలమని అన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, సర్దార్ వల్లభభాయ్ పటేల్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌తో పాటు ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని గుర్తు చేశారు. వారి ఆశయాలను సాకారం చేయడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదని, సమానత్వం, సామాజిక న్యాయం, సోదరభావం, రాజ్యాంగ విలువలను కాపాడుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. దేశ ప్రయోజనాలే వ్యక్తిగత ప్రయోజనాల కంటే గొప్పవని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రపంచ వేదికపై భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యువత తమ ప్రతిభ, కృషి, నైతిక విలువలు, దేశభక్తితో నూతన భారత నిర్మాణంలో భాగస్వాములు




కావాలని పిలుపునిచ్చారు. విజ్ఞానం, సాంకేతికత, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, సామాజిక సేవ వంటి ప్రతి రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. సామాజిక సామరస్యం, మత సామరస్యం, జాతీయ సమైక్యత భారతదేశ బలమని పేర్కొంటూ... కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటిగా నిలబడినప్పుడే దేశం మరింత శక్తివంతంగా ఎదుగుతుందని అన్నారు. “దేశం ముందు -- మనం తర్వాత” అనే భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా ఎగురవేసి, జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడాలన్నారు. చివరిగా దేశ ప్రజలందరికీ మరోసారి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ... “త్యాగాల చరిత్రను స్మరిద్దాం... త్రివర్ణ పతాక గౌరవాన్ని కాపాడుదాం... అభివృద్ధి చెందిన, సమానత్వ భారత నిర్మాణానికి మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదాం.. అని వైద్యం రాజగోపాల్ పిలుపునిచ్చారు.